సాక్షి పెద్దపల్లి

సోమవారం । 27 । మే । 2024



ఆదివరాహస్వామికి పోటెత్తిన భక్తులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.



తరలివచ్చి.. మొక్కులు తీర్చి

కొండగట్టు: అంజన్న సన్నిధిలో ఆదివారం రద్దీ నెలకొంది. వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.0/32.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీరన్న పట్నాలు



సుంకుపూజ చేస్తున్న బీర్ల పూజారులు

జూలపల్లి: మండల కేంద్రంలో మహంకాళి బీరప్ప కురుమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరన్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో సుంకుపట్టడం, బోనాలను పూజించి పట్నాలు వేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎల్కపెల్లి లచ్చయ్య, ప్రధాన కార్యదర్శి బండారి రమేశ్, ఉపాధ్యక్షుడు బొప్పనపెల్లి రవి, గుంటి అశోక్, శంకర్, ఇరుమల్ల పెద్దాపూరం, పెద్ద ఐలయ్య, బొప్పనపెల్లి మల్లేశం, బండారి శంకర్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జ్యోతినగర్: గోదావరిఖని పీజీ సెంటర్ సబ్‌స్టేషన్ మల్కాపూర్ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఇన్‌చార్జి విద్యుత్‌శాఖ అధికారి మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాంత్‌నగర్, జంగాలపల్లె, మల్కాపూర్ తదితర ప్రాంతాల్లో 11కేవీ లైన్‌లో మరమ్మతులు చేపట్టనున్న సందర్భంగా సోమవారం ఉదయం 8:30 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కె.భూపాల్

గోదావరిఖని: కార్మికుల హక్కుల సాధన కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.భూపాల్ అన్నారు. ఆదివారం శ్రామికభవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు, లేబర్ కోడ్‌లు అంశాలపై వివరించారు. సీఐటీయూ నినాదమైన 'ఐక్యత–పోరాటం' ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్మిక వర్గ హక్కులపై బీఎంఎస్ మినహా కలిసివచ్చే కార్మిక సంఘాలతో పోరాటాలకు సంసిద్ధులు కావాలన్నారు. పరిశ్రమల్లో కనీస వేతనాలు పెంచకుండా కేవలం బేసిక్‌లో కరువు భత్యం (డీఏ)ను కలిపి నూతన జీవోలు విడుదల చేయడం దురదృష్టకరమన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఉండాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. శిక్షణ తరగతుల్లో జిల్లాలోని సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాలు, సింగరేణిలోని పర్మినెంట్, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు, ఎన్టీపీసీలోని ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు, మున్సిపల్, గ్రామపంచాయతీ నాయకులు, రైల్వే కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులతో పాటు పార్టీ ప్రతినిధులు జి.జ్యోతి, రామాచారి, మెండె శ్రీనివాస్, గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్, ఎస్.వెంకటస్వామి, వి.నాగమణి, ఉల్లి మొగిలి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాకాసి రోడ్డు!

నెత్తురోడుతున్న గోదావరిఖని–మంథని రహదారి



గోదావరిఖని–మంథని రహదారి

- రోడ్డు ప్రమాదాలకు బలవుతున్న సింగరేణి కార్మికులు
- పట్టించుకోని యాజమాన్యం

గోదావరిఖని: గోదావరిఖని–మంథని ప్రధాన రహదారి ప్రమాదభరితంగా మారింది. ప్రధానంగా గోదావరిఖని ఫైవింక్లయిన్ నుంచి ముస్త్యాల వరకు ఉన్న రోడ్డు మూలమలుపులు, స్పీడ్‌బ్రేకర్లతో మృత్యుకుహరంగా తయారైంది. ఈక్రమంలో విధులకు వెళ్తున్న సింగరేణి కార్మికులు ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

జీడీకే–6 ఓసీపీ విస్తరణతో..

సింగరేణి యాజమాన్యం జీడీకే–5 ఓసీపీ విస్తరణతో నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి గోదావరిఖని నుంచి మంథనికి వెళ్లే రోడ్డును మళ్లించారు. నూతన రోడ్డు నిర్మాణం తర్వాత ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. ఇటీవల కాలంలో ముగ్గురు మృతి చెందగా చాలా మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల పాలయ్యారు. రోడ్డు మళ్లింపు తర్వాత కార్మికులకు దూరభారం పెరగడంతో పాటు ప్రమాదాల రూపంలో మృత్యువు వెంటాడుతోంది. రెండు షిఫ్టు కార్మికులకు వెళ్లే సింగరేణి కార్మికులు ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రి 11గంటల షిఫ్టు పూర్తయి ఇంటికి వచ్చే సమయం, రాత్రి షిఫ్టు డ్యూటీకి వెళ్లే సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా శనివారం అర్ధరాత్రి ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి బైక్‌తో బలంగా ఢీకొట్టడంతో రాసపెల్లి నాగరాజు(31) బదిలీ వర్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో జీడీకే–2ఏ మోరీ వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో జీడీకే–11 గనికి చెందిన సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. ఇద్దరు కార్మికులు ఈ రోడ్డు వెంట ప్రయాణించే క్రమంలో మృత్యువాత పడగా, పలువురు తీవ్రగాయాలతో ఆసుపత్రుల పాలయ్యారు.





నిలిపి ఉన్న లారీని ఢీకొట్టి మృతి చెందిన సింగరేణి కార్మికుడు, ఆందోళన చేస్తున్న సింగరేణి కార్మికులు

స్ట్రీట్‌లైట్లు వెలగకపోవడంతోనే ప్రమాదం

సింగరేణి యాజమాన్యం నిర్మించిన రోడ్డు వెంట వీధిదీపాలు ఏర్పాటు చేశారు. అయితే శనివారం రాత్రి ప్రమాదం జరిగిన సమయంలో వీధిదీపాలు ఆన్‌చేయక పోవడంతో ఎదురుగా నిలిపిఉన్న లారీ కనపడక బలంగా వెనుక నుంచి ఢీకొనడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. యాజమాన్యం తీరువల్లే కార్మికుడు మృతి చెందాడని తోటి కార్మికులు ఆందోళన నిర్వహించారు. కాగా ప్రమాదం జరిగిందని తెలియడంతో వీధిలైట్లు వేశారని కార్మికులు పేర్కొంటున్నారు.

పాతరోడ్డును అనుకూలంగా తీర్చిదిద్దాలి

జీడీకే–11 గనికి వెళ్లే పాతరోడ్డును విధులకు వెళ్లేందుకు అనుకూలంగా తీర్చిదిద్దాలని కార్మికులు కోరుతున్నారు. రోడ్డు ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో కొత్త రోడ్డు వెంట ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి జీడీకే–11 గని పాత రోడ్డును ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

కార్మికుడి కుటుంబంలో విషాదం..

రాసపెల్లి పోశం మెడికల్ అన్‌ఫిట్ అయ్యి కొడుకు నాగరాజుకు ఉద్యోగం పెట్టించాడు. ఏడాదిన్నర కిందటే విధుల్లో చేరిన నాగరాజు అనుకోని విధంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పోశంకు ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు కాగా ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆకుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. సింగరేణి ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉన్న కార్మికుడి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జెడ్పీటీసీ, బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి, బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య సందర్శించి నివాళి అర్పించారు.

రహదారి వెంట జరిగిన ప్రమాదాలు

- శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాసపెల్లి నాగరాజు అనే సింగరేణి బదిలీ వర్కర్ కార్మికుడు మృతి చెందాడు.
- 21మార్చి 2024న జరిగిన రోడ్డు ప్రమాదంలో మండె కిరణ్ అనే యువకుడు మృతి చెందగా, మరో యువకుడు రాకేశ్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- ఇటీవల జీడీకే–2ఏ గని మోరీ వద్ద లారీ ఢీకొట్టిన ప్రమాదంలో జీడీకే–11 గనిలో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు టి.సంపత్ జనరల్ మజ్దూర్ మృతి చెందాడు.
- ఫిబ్రవరిలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో సుందిళ్లకు చెందిన రాజమ్మ అనే మహిళ మృతి చెందింది.
- గతేడాది డిసెంబర్ 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎండీ మన్సూర్ అనే లారీ డ్రైవర్ మృతి చెందాడు.



ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాలు

గౌడకులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ బోనాలను ఆదివారం ఓదెలలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో ఆలయానికి వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. – ఓదెల

ప్రశాంతంగా జేఈఈ మెయిన్ అడ్వాన్స్‌డ్

రామగిరి: ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీ విద్యాలయాల్లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన జేఈఈ మెయిన్ అడ్వాన్స్‌డ్ పరీక్ష రామగిరి మండలం సెంటనరీకాలనీ మంథని జేఎన్టీయూలో ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్స్‌లో జరిగిన పరీక్షలో 106 మంది విద్యార్థులకు 104 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పరీక్షల నిర్వహణ తీరును హైదరాబాద్ యూనివర్సిటీ అధికారులు పరిశీలించారు. పరీక్ష రాసే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం కేంద్రంలోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి ఎస్సై కె.సందీప్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది

నీటిని పొదుపుగా వాడుకోవాలి

పాలకుర్తి: ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత కోరారు. ఆదివారం పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని బీసీకాలనీ, ధర్మారం క్రాస్‌రోడ్ ప్రాంతాలను సందర్శించి తాగునీటి వనరులను పరిశీలించారు. తాగునీటి సమస్య ఉందని స్థానికుల ఫిర్యాదు మేరకు డీపీవో ఆశాలత పర్యటించి స్థానికులతో మాట్లాడారు. నీటిని వృథాచేయరాదని, పొదుపుగా వాడుకోవాలని సూచించారు. డీపీవో వెంట కారోబార్ రాయమల్లు ఉన్నారు.



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు


జూలపల్లి(పెద్దపల్లి): గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఆదివారం జూలపల్లిలో దారబోయిన లింగయ్య యాదవ్ స్మారక ఉమ్మడి జిల్లాస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. క్రీడా టోర్నమెంట్ యువతలో ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటు శారీరక ఆరోగ్యం, స్నేహభావం పెంపొందిస్తాయని అన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, క్రీడాకారులు జాతీయస్థాయిలో ఆడేందుకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, అబ్బాపూర్ ఎంపీటీసీ దండె వెంకటేశం, సుల్తానాబాద్ జెడ్పీటీసీ ప్రకాశరావు, టోర్నమెంట్ నిర్వాహకులు మాజీ సర్పంచ్ నర్సింహయాదవ్, సీనియర్ క్రీడాకారులు రాజయ్య, భూసారపు రవీందర్, గంగాధర్, అమరగాని వెంకటేశ్, బాలెంగల హన్మయ్య, ఆవుల రాజు, కొమ్ము సతీశ్, టీమ్ క్రీడా సభ్యులు, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కన్నాల వాసికి అన్నమయ్య పురస్కారం

మంథని: మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన పోయిల లక్ష్మణ్ అన్నమయ్య పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లిలో సాంప్రదాయ కళల పరిరక్షణ సమితి, మడవలి చిరంజీవి భగవతార్, ఎస్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహిత్య, కళారంగాల్లో రాణిస్తున్న 116 మందికి 2024 అన్నమయ్య పురస్కారాలు అందించారు. గాయకుడిగా రాణిస్తూ తన పాటల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేస్తున్నందుకుగాను అవార్డు అందుకున్నట్లు లక్ష్మణ్ తెలిపారు.



అవార్డు అందుకుంటున్న లక్ష్మణ్







మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు తొలుత కోనేటిలో స్నానాలు ఆచరించారు. ఆ తర్వాత మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్రస్వామి, ఖండేలరాయుడిని దర్శించుకున్నారు. స్వామి వారి పేరిట ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. బోనాలు తయారు చేసి నైవేద్యం సమర్పించారు. ఆలయ ఈవో సదయ్య, చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. – ఓదెల(పెద్దపల్లి)

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

సుల్తానాబాద్: ఇద్దరు విద్యుత్ ఉద్యోగులను సస్పెన్షన్ చేసినట్లు ట్రాన్స్‌కో డీఈ తిరుపతి తెలిపారు. లైన్‌మెన్ దీన్‌దయాల్‌ను మీసేవా కేంద్రాలకు మీటర్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించినందుకు, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్యను లేబర్లకు విద్యుత్ షాక్‌కొట్టి గాయాల పాలు కావడానికి కారణమయ్యారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

రోహింగ్యాలకు ప్రభుత్వ ఉద్యోగాలా?

పెద్దపల్లిరూరల్: రోహింగ్యా ముస్లింలకు రాజ్యాంగ విరుద్ధంగా పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడాన్ని నిరసిస్తూ ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్ మాట్లాడుతూ 15 ఏళ్ల కాలంగా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పొరుగు దేశాల నుంచి వలస వచ్చిన రోహింగ్యాలకు ఓబీసీ సర్టిఫికెట్లు జారీ చేస్తూ ఆ కోటా కింద ఉద్యోగాలను కట్టబెడుతున్నారని ఆరోపించారు. హైకోర్టు ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వొద్దని ఆదేశాలు జారీ చేసినా కోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలారపు పర్వతాలు, దాడి సంతోష్, మేకల శ్రీనివాస్, కావేటి రాజ్‌గోపాల్, పడాల శ్రీధర్, రాజం మహంత, రమేశ్, కుమారస్వామి, సంపత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

- బల్దియా వాహనాలకు పార్కింగ్ షెడ్డు కరువు
- తరచూ పాడవుతున్న పారిశుధ్య వాహనాలు
- వాహనాల సంఖ్య పెరిగినా పట్టించుకోని అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో చెత్త సేకరణకు ఉపయోగించే విలువైన వాహనాలు ఎండకు ఎండుతూ.. వానలకు తడుస్తూ పాడవుతున్నాయి. బల్దియా కార్యాలయంలో వాహనాలను పార్కింగ్ చేయడానికి పార్కింగ్ షెడ్డు కూడా లేదు. అలాగే వాహనాలకు సకాలంలో మరమ్మతు చేసేందుకు మెకానిక్ షెడ్డు లేదు. చిన్నపాటి మరమ్మతులకు ప్రైవేట్ గ్యారేజ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. చెత్త సేకరణకు ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు, జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్లు, డంపర్ ప్లేసర్ తదితర వాహనాలు సుమారు 100 వరకు ఉన్నాయి. మరమ్మతుల సమస్యలతో కొన్ని వాహనాలు ప్రైవేట్ గ్యారేజీల్లో మూలకుపడి ఉన్నాయి. బల్దియాలో వాహనాల సంఖ్య పెరుగుతున్నా వాటి రక్షణపై అధికారులకు పట్టింపు లేకుండా పోయిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మరమ్మతులకు రూ.లక్షల్లో ఖర్చు

పారిశుధ్య వాహనాల మరమ్మతులకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. పెద్ద సమస్యలు తలెత్తితే నిధులు ఎక్కువగా వెచ్చించాల్సి వస్తోంది. దీంతో బల్దియా నిధులు ప్రైవేటు వ్యక్తులకు దరాదత్తం చేయాల్సి వస్తోంది. బల్దియా ఆధ్వర్యంలో మరమ్మతుల కేంద్రం నిర్వహిస్తే ఆ నిధులను ఆదాచేయొచ్చు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గతంలో వర్క్‌షాప్‌పై ప్రతిపాదన

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలనే ఆలోచనపై గతంలో ఉన్నతాధికారులు దృష్టిసారించారు. బల్దియా కార్యాలయం వెనుక వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై ఉన్నతాధికారులు అప్పుడు చర్చించి, ప్రతిపాదన కూడా చేశారు. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.





షెడ్డులేక ఎండలో పార్కింగ్ చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు

పార్కింగ్ షెడ్, గ్యారేజీపై దృష్టిసారిస్తాం

నగరపాలక సంస్థ వాహనాల పార్కింగ్ కోసం బల్దియా ఆవరణలోనే పార్కింగ్ షెడ్డు నిర్మించడంతో పాటు చిన్నపాటి మరమ్మతులు చేపట్టడానికి అనుకూలంగా ఉండేలా గ్యారేజీ నిర్మాణాలపై దృష్టిసారిస్తాం. ఇప్పటికే అధికారులు కూడా ఈ విషయంపై తనతో చర్చించారు. దీనిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– సీహెచ్.శ్రీకాంత్, నగరపాలక కమిషనర్



బల్దియాలో వాహనాలు

ఆటో ట్రాలీలు	50
ట్రాక్టర్లు	18
ఫాగింగ్ వాహనాలు	03
జేసీబీ వాహనం	02
బ్లేడ్ ట్రాక్టర్లు	02
డంపర్ ప్లేసర్ వాహనం	02
కంపాక్టర్ వాహనం	02
జెట్టింగ్ సెక్షన్ మిషన్ వాహనం	01
లిట్టర్ పిక్కర్స్ వాహనం	01
స్వీపింగ్ మిషన్ వాహనం	01
బొలోరో వాహనాలు	02
స్కైలిఫ్టర్ వాహనం	02
వైకుంఠ రథాలు	04
వాటర్ ట్యాంక్ వాహనాలు	06
బాబ్‌కాట్ వాహనం	01

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి


నాగరాజు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: జనగామ–సుందిళ్ల గ్రామ శివారులోని ఇసుక బంకర్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు రాసపల్లి నాగరాజు (31) మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని జవహర్‌నగర్‌లో నివాసముంటున్న నాగరాజు ఆర్జీ–1 డివిజన్ 11 ఇంక్లయిన్ గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సెకండ్‌షిఫ్టు ముగించుకొని తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జనగామ శివారులోని ఇసుక బంకర్ వద్ద ప్రధాన రోడ్డుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీకొనడంతో హెల్మెట్ పగిలి తలకు దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్లక్ష్యంగా రోడ్డుపై లారీని ఆపి తన కొడుకు మరణానికి కారణమైన లారీడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి పోషం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై ఫరీద్ తెలిపారు.

అనంతారం వాసి..


రాజశేఖర్ మృతదేహం

కొత్తపల్లి/తంగళ్లపల్లి: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని శ్రీరాములపల్లి స్టేజ్ వద్ద కరీంనగర్– వేములవాడ ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కొత్తపల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామానికి చెందిన జక్కుల రాజశేఖర్ కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకొని తిరిగి బైక్‌పై వెళ్తున్న క్రమంలో శ్రీరాములపల్లి స్టేజ్ వద్ద అదుపుతప్పి కల్వర్టు గోడను ఢీకొట్టడంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజశేఖర్‌కు ఇటీవలే వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

పాలకుర్తి: ఓ యువకుడి లైంగిక వేధింపులు భరించలేక బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని బీసీకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం గుర్రాంపల్లికి చెందిన బాలిక కొంతకాలంగా బీసీకాలనీలో నివాసముంటోంది. పెద్దపల్లి మండలం బొంపెల్లికి చెందిన అరికిల్ల శ్యాం కొంతకాలంగా బాలికను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈనేపథ్యంలో వేధింపులు తాళలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బసంత్‌నగర్ రెండో ఎస్సై శివాణిరెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంజన్న చెంత.. వసతుల చింత

- ఐదు రోజుల్లో హనుమాన్ పెద్ద జయంతి
- నత్తనడకన ఏర్పాట్లు
- లక్షల్లో రానున్న భక్తులు


చెత్తాచెదారంతో నిండిపోయిన మురుగుకాలువ


అంజన్న ఆలయంలో భక్తులు


నీటిట్యాంకు వద్ద అపరిశుభ్రత


కోనేరు సమీపంలో చెత్తాచెదారం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆలయంలో మరో ఐదు రోజుల్లో హనుమాన్ పెద్ద జయంతోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు లక్షలాది మంది హనుమాన్ భక్తులు, దీక్షాపరులు తరలివస్తారు. కానీ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి.

ఖర్చు లక్షల్లో.. ఏర్పాట్లు నామమాత్రం

ఏటా హనుమాన్ జయంతికి వసతుల నిమిత్తం ఆలయ అధికారులు రూ.లక్షల్లో ఖర్చు చేస్తారు. కాగా జయంతికి వారం రోజుల ముందే అన్ని ఏర్పాట్లు చేయాలి. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ కారణం చూపి ఆలయానికి రంగులు వేయలేదు. తాత్కాలికంగా దుకాణాదారుల సాయంతో నామమాత్రంగా రంగులు పూర్తి చేశారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు వేశారు. చలివేంద్రాలు ఇంకా ఏర్పా టు చేయలేదు. అలాగే ఘాట్‌రోడ్ వెంట ఇరువైపులా ఉన్న స్థలంలో, లడ్డూప్రసాదం తయారీ కేంద్రం వద్ద


తాత్కాలిక స్టాండ్‌లు

భక్తులు వాహనాలు నిలపడంతో పాటు విశ్రాంతి తీసుకుంటారు. అందుకు తగిన ఏర్పాట్లు కానరావడం లేదు. ఆలయ పరిసరాలు కంపుకొడుతున్నాయి. కోనేరు సమీపంలో, తాగునీరు నల్లాల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

తాత్కాలిక స్టాండ్‌లతోనే..

ఏటా హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల కోసం తాత్కాలిక స్టాండ్‌లు, వైర్లతో క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తుండగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సదరు క్యూలైన్లలో ఎవరైనా భక్తులు దారితప్పితే మళ్లీ ఆలయం ఎదుట ఉన్న కార్యాలయం నుంచి దారిపట్టాలి. ఇలా సుమారు 2 గంటల నుంచి 3గంటల సమయం వృథా అవుతోంది. ఇలా స్వామి వారి దర్శనం, మాల విరమణ, కోనేరు వద్ద భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈసారైనా ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం తగదు



లక్షల మంది తరలివచ్చే ఉత్సవాలకు అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలి. ఏర్పాట్లలో నిర్లక్ష్యం తగదు.

– నరేశ్, గంగాపూర్

ఏర్పాట్లు కొనసాగుతున్నాయి



హనుమాన్ జయంతికి వచ్చే భక్తులకు కావల్సిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరో రెండు రోజుల్లో అన్ని సౌకర్యాలు పూర్తవుతాయి. లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేసి దీక్షాపరులు ప్రశాంత వాతావరణంలో మాల విరమణ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఆలయ ఈవో

గంభీరావుపేటవాసికి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న అజ్మతుల్లా హుస్సేనీ

గంభీరావుపేట(సిరిసిల్ల)/కరీంనగర్ కార్పొరేషన్: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ది టైమ్స్ ఇంగ్లిష్ మ్యాగజైన్ అజ్మతుల్లా హుస్సేనీని భారతీ అన్‌మోల్ అవార్డుల్లో భాగంగా లీడర్‌షిప్ అండ్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు(మైనార్టీ డెవలప్‌మెంట్ విభాగం)ను అందించింది. మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అజ్మత్ అవార్డును అందుకున్నారు. పలువురు స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అనారోగ్యం ఏదైనా ఎమర్జెన్సీనే

- మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరల్డ్ ఎమర్జెన్సీ డే


హెల్త్‌టాక్‌లో మాట్లాడుతున్న మెడికవర్ వైద్యులు

కరీంనగర్‌టౌన్: అనారోగ్యం ఏదైనా దాన్ని ఎమర్జెన్సీగానే భావించి బాధితుడిని ఆస్పత్రికి తరలించాలని మెడికవర్ వైద్యులు సూచించారు. వరల్డ్ ఎమర్జెన్సీ డేను పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం విద్యానగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెల్త్‌టాక్, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులకు మూ ల కారణమైన బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకో వాలన్నారు. ఆహారం, ఇతర అలవాట్లపై నియంత్రణ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. 23ఏళ్లకే హార్ట్‌స్ట్రోక్ వచ్చిన పేషెంట్లను కూడా చూస్తున్నామని, ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే మద్యం, స్మోకింగ్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు వ్యాయామం అవసరం ఉందన్నారు. 17వ డివిజన్ కార్పొరేటర్ కోల భాగ్యలక్ష్మి ప్రశాంత్, మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఎమర్జెన్సీ ఫిజీషియన్లు వేముల సత్యనారాయణ, విద్యా ప్రకాశ్, రుత్విక్, దీక్షిత్, క్రిటికల్ కేర్ హెచ్‌వోడీ ఉపేందర్ రెడ్డి, న్యూరో సర్జన్ వెంకటేశ్, యూ రాలజిస్ట్ రవిశంకర్, మెడికల్ సూపరింటెండెంట్ రవిమల్లారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమాండ్ల రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ 'కొంతం' హఠాన్మరణం


కొంతం శ్రీనివాసరెడ్డి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కొంతం శ్రీనివాసరెడ్డి (56) ఆదివారం హఠాన్మరణం పొందారు. వారం రోజుల క్రితం స్నేహితులతో కలిసి వైష్ణవి ఆలయాన్ని దర్శించుకుని తిరుగుపయనమవుతుండగా ఢిల్లీలో గుండెపోటుకు గురయ్యారు. వెంట ఉన్న మిత్రులు వెంటనే అక్కడి ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కొంతం శ్రీనివాసరెడ్డి బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా, రైల్వే హమాలీ సంఘ అధ్యక్షుడిగా, హనుమాన్ అలయ కమిటీ అధ్యక్షుడిగా ఈ ప్రాంత ప్రజలందరికీ సుపరిచితుడు. శ్రీనివాసరెడ్డి ఆకస్మిక మృతికి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు సోమవారం సా యంత్రం పెద్దపల్లిలో నిర్వహిస్తారని కుటుంబీకులు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై ముందుగా వెళ్తున్న కారును ఓ లారీ ఢీకొంది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారి ట్రాఫిక్ సిగ్నల్ దాటిన తర్వాత గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ బ్రేకులు పనిచేయక పోవడంతో ముందు వెళ్తున్న కారును వెనుక భాగంలో ఢీకొంది. తృటిలో ప్రమాదం తప్పింది. లారీ బ్రేకులు పడకపోవడంతో ఢీకొన్నట్లు డ్రైవర్ హకీమ్ తెలిపారు. కారు డ్రైవర్ అన్వేష్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి రిమాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలకేంద్రంలోని బతుకమ్మతెప్ప వద్ద గంజాయి సేవిస్తున్న ఒద్యారం గ్రామానికి చెందిన అజయ్, సోమారంపేటకు చెందిన తడకపల్లి శేఖర్, అనంతారం గ్రామానికి చెందిన దారవేణి మహేశ్, గొల్లపెల్లికి చెందిన పున్ని ప్రశాంత్‌లను రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయి, ఒక పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి గురించి సమాచారం పోలీసులకు తెలిపాలని కోరారు. ఇల్లంతకుంట ఎస్సై ఎల్.రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమాన్‌పూర్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి శివారు ప్రాంతంలోని మానేరువాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దని ఆదేశాలు జారీ చేసినా కొంతమంది ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు గట్టెపల్లి నుంచి కమాన్‌పూర్‌కు వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

పంచర్ షాపు దగ్ధం


దగ్ధమైన పంచర్ షాప్

కోరుట్ల: పట్టణ శివారులోని కంచరకుంట ప్రాంతంలో ఆదివారం పంచర్‌షాపు దగ్ధమైంది. ఓ రైతు తన పొలంలో కొయ్యకాలుకు నిప్పుపెట్టగా మంటలు కోరుట్ల–మెట్‌పల్లి జాతీయ రహదారి వరకు వ్యాపించాయి. రోడ్డు పక్కనే కైసర్ అనే వ్యక్తికి చెందిన రేకులతో నిర్మించుకున్న పంచర్ షాపు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.ఒక లక్ష నష్టం వాటిల్లిందని, ఉపాధి కోల్పోయానని బాధితుడు వాపోయాడు. కాగా ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి చెందిన 10 టేకు దుంగలు కూడా దగ్ధమయ్యాయి.

వడదెబ్బతో రైతు మృతి

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన రైతు ఎక్కల్‌దేవి రాజయ్య (60)వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజయ్య ఆదివారం తన పొలంలో వరి కొయ్యలకు నిప్పు అంటించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అక్కడే గడిపాడు. ఇటు ఎండ తీవ్రత, అటు అగ్గి దగడుకు వడదెబ్బతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు.

వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ రిమాండ్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ మంతెన సంతోష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గతంలో వెంకట్రావుపేట మూలవాగు నుంచి ఇసుకను తరలించే ట్రాక్టర్ల నుంచి విలేజ్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టగా సంతోష్‌పై అభియోగాలు నిర్ధారణ కావడంతో కోర్టు అనుమతితో రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

తండ్రి చితికి నిప్పుపెట్టిన కూతురు

శంకరపట్నం: తండ్రి చితికి చిన్నకూతురు నిప్పు పెట్టిన సంఘటన మండలంలోని కొత్తగట్టులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నల్ల మహేందర్‌రెడ్డికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు సంధ్యకు వివాహం జరగగా.. హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. మూడు రోజుల క్రితం మహేందర్‌రెడ్డి పెద్దకూతురు వద్దకు వెళ్లగా గుండెనొప్పితో శనివారం చనిపోయాడు. మహేందర్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరగగా చిన్నకూతురు అనూష తండ్రి చితికి నిప్పు పెట్టింది.

అజ్మీరాతండాలో పిడుగుపాటు


కొబ్బరి చెట్టుపై పడ్డ పిడుగు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం సీతారాం నాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలోని అజ్మీరాతండాలో కొబ్బరిచెట్టుపై శనివారం రాత్రి పిడుగుపడింది. పక్కనే ఉన్న గడ్డికుప్పలకు మంటలు అంటుకోకుండా తండాకు చెందిన అజ్మీర వసంత్ అప్రమత్తమయ్యాడు. తండావాసులతో కలిసి మంటలు అంటుకోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన వెంళ కనకమ్మ(60) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. ఇటీవల తాడికల్‌లోని జాతీయ రహదారిపై డీజిల్ ట్యాంకర్ బోల్తాపడి కనకమ్మ తీవ్రంగా గాయపడింది. 12రోజుల పాటు చావుబ్రతుకులతో పోరాడి ఆదివారం చనిపోయింది. ట్యాంకర్ ప్రమాదం ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

బీరయ్య పట్నాల వేడుకల్లో అపశృతి

- కళ్లెదుటే కొడుకు మృతి
- బాధిత కుటుంబంలో విషాదం


వెంకటేశ్ (ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): నమ్ముకున్న వృత్తి ఆ కుటుంబానికి గర్భశోకం మిగిల్చింది. కళ్లెదుటే కొడుకు మృతిచెందడం తీరని విషాదం నింపింది. గ్రామస్తుల వివరాలు.. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం నార్లపురం గ్రామానికి చెందిన బిర్లా రాజయ్య బీరప్ప పట్నాలు వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు కొడుకులు నరేశ్, వెంకటేశ్. ఈక్రమంలో గొల్లపల్లి మండలం చందోళిలో బీరప్ప పట్నాలు ఉండటంతో రాజయ్య తన ఇద్దరు కొడుకులు, ఇతర సభ్యులతో ఈనెల 24న వచ్చారు. 25న సాయంత్రం కురుమ సంఘం ఆచారం ప్రకారం బీరప్ప పట్నాల ఉత్సవాల్లో భాగంగా స్వామివారల విగ్రహాలను చిన్నవేని చంద్రయ్య వ్యవసాయ బావిలో దాచిపెట్టారు. వాటిని నీటిలో నుంచి బయటకు తీసేందుకు రాజయ్య ఇద్దరు కొడుకులు బావిలోకి దూకారు. విగ్రహాలను వెలికితీసే క్రమంలో చిన్న కొడుకు వెంకటేశ్ కొంతసేపటి వరకు నీటి నుంచి బయటకు రాలేదు. పెద్ద కొడుకు బయటకు వచ్చాడు. తమ్ముడు రాకపోవడంతో మరోసారి నరేశ్ బావిలోకి దూకి వెతుకుతుండగ నీటిలో అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్‌ను బయటకు తీసకువచ్చారు. చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

రాజన్నా.. ఇదేమి గోస?

- లడ్డూ ప్రసాద తయారీ కేంద్రంలో వసతులు కరువు
- వేములవాడలో చెమటలు కక్కుతూ పనిచేస్తున్న కార్మికులు
- స్వచ్ఛందంగా హాజరవుతున్న పలువురు మహిళలు
- సౌకర్యాల లేమితో ఇబ్బంది


లడ్డూ తయారు చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వేములవాడ: రాజన్న లడ్డూ ప్రసాద తయారీ కేంద్రంలో అరకొర వసతులతో కార్మికులు పనిచేయలేకపోతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. బోంది తయారీకి వాడే గ్యాస్ మంటతో గోదాంలో సిబ్బంది, కార్మికులు ఉండలేకపోతున్నారు. కూలర్లు పెట్టించిన ఉక్కపోత తగ్గక చెమటలు కక్కుతూ అతికష్టం మీద లడ్డూలు తయారు చేస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్‌తో ఇబ్బంది

రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు లడ్డూ ప్రసాదాన్ని కొనుక్కొని ఇంటికి తీసుకెళ్తుంటారు. నిత్యం వచ్చే భక్తులకు తోడు జూన్ 1న హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు కొండగట్టుకు వచ్చే మాలధారులు వేములవాడ రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. ఎక్కువ సంఖ్యలో లడ్డూలు తయారు చేయాల్సి ఉండడం.. గోదాంలో అందరూ ఔట్ సోర్సింగ్ సిబ్బందే ఉండడంతో ఇబ్బందిగా మారింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, గోదాంలోని పొయ్యిల ద్వారా వచ్చే వేడి కలిసి తీవ్ర ఉక్కపోత ఉండడంతో అక్కడ కార్మికులు, సిబ్బంది ఎక్కువ సమయం ఉండలేకపోతున్నారు.

మండుతున్న ఎండలతో ఉక్కపోత

ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రసాద తయారీ గోదాంలో ఉక్కపోత పెరిగింది. లడ్డూలు తయారు చేసే క్రమంలో ఉక్కపోతతో ఊపిరి పీల్చుకోవడం కూడా ఇబ్బందిగా ఉంటుందని ప్రసాదాలు తయారు చేసే సిబ్బంది పేర్కొంటున్నారు. లడ్డూల తయారీకి ప్రత్యేక భవనం నిర్మిస్తే ఈ సమస్యలు తీరుతాయని సిబ్బంది తెలుపుతున్నారు. బోంది తయారీ చేసే గది, లడ్డూలు చేసే హాలు ఒకటే కావడంతో ఉష్ణోగ్రతలు పెరిగి ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు.

సిబ్బంది కొరత ఉంది

లడ్డూ ప్రసాదాల తయారీకి సిబ్బంది కొరత ఉంది. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పనులు చేయిస్తున్నాం. హనుమాన్ జయంతికి లడ్డూల తయారికి ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేశాం. సరైన వసతి లేకపోవడం, సిబ్బంది కొరత ఉండడంతో ఆటంకంగా మారుతోంది. ఈ విషయాన్ని చాలాసార్లు ఉన్నతాధికారులకు తెలియజేశాం.

– ప్రతాప నవీన్, ఏఈవో


కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఓ కుటుంబం


ఆలయంలో క్యూలైన్లలో భక్తులు


రాజన్నను దర్శించుకునేందుకు ఆలయంలో భక్తులు

రాజన్నకు పోటెత్తిన భక్తులు

- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- దర్శనానికి మూడు గంటలు

వేములవాడ: వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో రాజన్నను దర్శించుకునేందుకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆదివారం దాదాపు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ పెరగడంతో దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు.